కొందరికే తల్లికి వందనం..!

- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న తల్లులు
- అర్హత ఉన్నా వర్తించని పథకం
- చిరుద్యోగులపై చిన్నచూపు..



నరసన్నపేట సచివాలయంలో తల్లికి వందనం కోసం ఆరా తీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నరసన్నపేట: తల్లికి వందనం పథకం అమలు అంతా గందరగోళంగా ఉంది. అర్హులైన విద్యార్థులకు సైతం డబ్బులు జమకాలేదు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థుల అందరికీ తల్లికి వందనం పేరిట రూ.15 వేలు ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ప్రకటించారు. ఇప్పుడు రూ.13 వేలే ఇస్తున్నారు. అదీ కూడా అనేక మందికి ఇవ్వలేదు. ప్రస్తుతం ఒకటో తరగతి, పదో తరగతి పాసైన విద్యార్థులకు తల్లికి వందనం రాలేదు. చిరుద్యోగాలు చేస్తున్న వందల కుటుంబాలకు తల్లికి వందనం అమలు చేయలేదు. మాకెందుకు డబ్బులు రాలేదని స్కూళ్లు, సచివాలయాల చుట్టూ వారంతా తిరుగుతున్నారు. చాలా మంది పేర్లు జాబితాలో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

అంతా మోసమే..

ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే వారందరికీ రూ.15 వేల చొప్పున తల్లికి వందనం జమ వేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా కనిపిస్తోంది. నరసన్నపేట మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌లో 12,800 మంది చదువుతున్నారు. ఇంటర్‌మీడియెట్ విద్యార్థులు 2460 మంది ఉన్నారు. వీరిలో ఎంతమంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం మండల వ్యాప్తంగా ఇచ్చారనేది తెలియడం లేదు. సచివాలయ స్థాయిలో అర్హులు, సంకేతిక తప్పిదాల పేర్లు ప్రకటించారు. దీంతో సచివాలయాల చుట్టూ తల్లులు తిరుగుతున్నారు.



జెడ్పీ సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్లు

ఇద్దరు పిల్లలకూ తల్లికి వందనం రాలేదు



నాకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుంది. అబ్బాయి 8వ తరగతి. ఇద్దరికీ డబ్బులు పడలేదు. సచివాలయానికి వెళ్లే కరెంట్ అధికంగా వాడారు, అందుకే రాలేదంటున్నారు. ఈ విధంగా కరెంట్ అధికంగా వాడామనే నెపంతో అర్హులకు తల్లికి వందనం ఇవ్వకపోతే ఎలా? ప్రభుత్వం ఈ విధంగా కొర్రీలు పెట్టి కొందరికే తల్లికి వందనం ఇవ్వడం శోచనీయం.

– తంగుడు సుందరరావు, సౌభాగ్యలక్ష్మీనగర్, నరసన్నపేట

అన్ని అర్హతలున్నా డబ్బులు జమ కాలేదు



మాకు ఇద్దరు ఆడ పిల్లలు. కష్టపడి చదివిస్తున్నాం. ఇద్దరికీ డబ్బులు వస్తాయంటే సంతోషించాం. తీరా పథకం అమలు అయిన తరువాత డబ్బులు పడలేదు. కరెంటు బిల్లు సమస్య అంటున్నారు. ఒక నెలలో 300 యూనిట్లు విద్యుత్ వాడారు అందుకే రాలేదు అంటున్నారు. అంత ఎలా అయిందో మాకు తెలీదు. కరెంటు ఆఫీస్‌కు వెళ్లి సరాసరిన పరిశీలిస్తే నెలకు 154 నుంచి 160 యూనిట్లు వాడుతున్నట్లు ఉంది. మరి ఎందుకు పథకం ఇవ్వలేదో తెలియడం లేదు.

– బమ్మిడి శోభారాణి, తామరాపల్లి, నరసన్నపేట

తల్లికి వందనం ఇవ్వాలి

స్వచ్ఛ భారత్ పథకంలో మండల కో ఆర్డినేటర్లుగా నెలకు రూ.11,300 జీతానికి పలువురు పనిచేస్తున్నారు. వీరి పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేయలేదు. మాలాంటి చిరుద్యోగులకు తల్లికి వందనం ఇవ్వకపోవడం అన్యాయం. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో అధికారులకు విన్నవిచ్చాం.

– పి.ఎల్.నాయుడు, స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ల సంఘం అధ్యక్షుడు, నరసన్నపేట

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం



మాట్లాడుతున్న ఎంపీపీ ఆరంగి మురళి

నరసన్నపేట: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, సాగు నీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయని, షట్టర్లు శిథిలమయ్యాయని, వీటి గురించి సమావేశంలో చర్చిద్దామనుకున్నా.. వంశధార ఇంజినీర్లు ఎవరూ సమావేశానికి రాలేదని ఎంపీపీ ఆరంగి మురళి, సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. నరసన్నపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రేణుక అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. సమావేశానికి వంశధార అధికారుల గైర్హాజరుపై ఎంపీపీతోపాటు, సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, సభ్యులు గదలి మల్లేశ్వరరావు, రువ్వ వాసుదేవరావు తదితరులు మండిపడ్డారు. అధికారుల గైర్హాజరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ అన్నారు. గృహ నిర్మాణశాఖ చర్చలో భాగంగా ఏఈ రాజేంద్రప్రసాద్‌పై సభ్యులు మండిపడ్డారు. గ్రామాల్లో ఏ కార్యక్రమం చేపట్టినా సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కూడా ద్వంద వైఖరి వహిస్తున్నారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు కాదని ఇతరులతో కార్యక్రమాలు చేస్తూ ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై తగిన చర్యలు తీసుకోవాలని, సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వాలని ఎంపీపీ కోరారు. నరసన్నపేట పట్టణంలో విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించామని, సోలార్ విద్యుత్ పథకాన్ని వినియోగించుకోవాలని ఏఈ కోటేశ్వరరావు సభ్యులను కోరారు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామని రైతులు వినియోగించుకోవాలని ఏఓ సూర్యకుమారి తెలిపారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ టి.సత్యనారాయణ, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పలువురు అధికారులు, సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



సారవకోట మండలంలోని జాతీయ రహదారికి పక్కన కొత్తూరుకు వెళ్లే రహదారికి ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభానికి పిచ్చి మొక్కలు, తీగలు అల్లుకున్నాయి. ఈ విద్యుత్ లైన్లు ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్తుండటంతో ప్రమాదాలు సంభవించవచ్చునని స్థానికులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. కొత్తూరు వెళ్లే గ్రామస్తులు ఈ విద్యుత్ స్తంభానికి ఆనుకుని ఉన్న షెడ్ దగ్గర ఎక్కువగా నిల్చుని ఉంటుంటారు. విద్యుత్ సిబ్బంది స్పందించి స్తంభానికి అల్లుకున్న పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

–సారవకోట

ఇది వెన్నుపోటు ప్రభుత్వం



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య, నాయకులు

- పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య

సారవకోట: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలక్షేపం చేస్తూ.. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానిది అంతా వెన్నుపోటు పాలన అని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆరోపించారు. కూటమి ఏడాది పాలనపై వైఎస్సార్‌సీపీ ప్రచురించిన వెన్నుపోటు పుస్తకాన్ని మండల కేంద్రం సారవకోటలో బుధవారం పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వ పాలనను తీవ్రంగా విమర్శించారు. పథకాలు ఇవ్వకుండా ప్రజలందరికీ వెన్నుపోటు పొడిచిందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి యాళ్ల శ్యామసుందరరావు, పల్లి కృష్ణారావు, బొంగు కొండయ్య, గడ్డిబోయిన గోవింద, గొర్లె ఢిల్లేశ్వరరావు, కోరాడ అప్పయ్య, కత్తిరి అప్పలనాయుడు, గొల్లంగా వెంకటరావు, కాళ్ల సింహాచలం, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, షణ్ముఖ, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు

సరుబుజ్జిలి: అధికారులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ హెచ్చరించారు. పీఎం మోడీ ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో కృష్ణా జిల్లా పెడన ఎమ్మెల్యే కాగితపు కృష్ణప్రసాద్‌తో కలిసి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న యోగాడే కార్యక్రమానికి విధులు కేటాయించిన అధికారులు హాజరుకాపోవడం ఏమిటని ఎంపీడీఓను ప్రశ్నించారు. సమీక్షకు గైర్హాజరైన సచివాలయం ఉద్యోగులతోపాటు, పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేసి సంజాయిషీ కోరాలని అధికారులను ఆదేశించారు. డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, ఎంపీడీఓ ఎం.పావని, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

ఆమదాలవలస: మండలంలోని చిట్టివలస గ్రామంలో గల అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు, వేదపండితులు రామాపంతుల వెంకట గోపాల శర్మ, చైతన్య శర్మ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయ ఆవరణలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



రీసర్వే విభాగ డీటీ గోవిందరావును అభినందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస రెవెన్యూ కార్యాలయంలో పలువురు అధికారులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ శాఖలో ఇటీవల సాధారణ బదిలీలతోపాటు పలువురికి ఉద్యోగోన్నతి కల్పించారు. గతంలో ఇక్కడ ఆర్ఐగా పనిచేసిన పప్పల గోవిందరావు ఉద్యోగోన్నతిపై మండల రీ సర్వే విభాగ డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు పొందూరు రీ సర్వే ఉప తహసీల్దార్‌గా పనిచేసిన కూన వైకుంఠరావు ఆమదాలవలస పౌరసరఫరాల విభాగ ఉప తహసీల్దార్‌గా విధుల్లో చేరారు. ఆమదాలవలస పౌరసరఫరాల విభాగ ఉప తహసీల్దార్‌గా పనిచేసిన హనుమంతు మురళి.. ఇదే కార్యాలయ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. వీరందరికి రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

యంత్రాలతో సాగు మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సరుబుజ్జిలి: యాంత్రీకరణ పద్ధతులు ద్వారా సాగు చేస్తే వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించవచ్చునని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు తెలిపారు. మండలంలోని చిగురువలస పంచాయతీ పరిధిలోని వెన్నెలవలస గ్రామంలో పెట్టీకమ్ సీడ్ డ్రిల్ యంత్రం ఉపయోగం గురించి బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. మండల సమన్వయకర్త అత్తులూరి లావణ్య, పాతిన శ్రీనివాస్, శివ్వాల కుమారి పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం



గ్రామస్తులతో చర్చలు జరుపుతున్న రెవెన్యూ అధికారులు

హిరమండలం: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని అధికారులు చెప్పారు. బుధవారం చాపరాయిగూడలో రెవెన్యూ అధికారులు పర్యటించారు. గత కొద్ది రోజులుగా గులుమూరు పంచాయతీ పరిధిలోని గిరిజనుల భూములపై వివాదం నడుస్తోంది. ఏపీ గిరిజన కార్మిక సంఘం ఆందోళనలను నిర్వహించింది. అధికారులకు వినతిపత్రాలు అందించింది. ఈ నేపథ్యంలో ఆర్ఐ ఉమాశంకర్, వీఆర్వో సింహాచలం గ్రామస్తులతో చర్చలు జరిపారు. ఈ నెల 24 నాటికి సమస్యకు పరిష్కారమార్గం చూపుతామని హామీ ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ దశాబ్దాలుగా గిరిజనుల సాగులో ఉన్న భూమిని ఎలా లాక్కుంటారని ప్రశ్నించారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. దాసు, కృష్ణ, ప్రసాద్, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..



పవన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీకాంత్, నాయకులు

పాతపట్నం: మండల కేంద్రంలోని ఎగువ కంద్రవీధిలో ఉంటున్న నవతల సర్పంచ్ పల్లి శ్రీహరి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. శ్రీహరిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర తూర్పుకాపు కుల విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ బుధవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. మండలంలోని రొమదల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తులగాపు తిరుపతిరావు మనవడు కొరాడ పవన్ (ఇందు కుమార్) ఇటీవల మృతి చెందారు. తిరుపతిరావు కుటుంబాన్ని మామిడి శ్రీకాంత్ పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పవన్ చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడి గంగాధర్, కనకాల కర్రన్న, చందరరావు, నాగరాజు, అర్జున్ పాల్గొన్నారు.

వితరణ

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు పూర్వ విద్యార్థి వంశీ తండ్రి వెంకటరమణ స్టీల్ ప్లేట్లు వితరణ చేశారు. ప్లేట్లును కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పవన్‌కు అందించారు. వంశీ తండ్రిని ప్రిన్సిపాల్ అభినందించారు. అధ్యాపకులు వదనగిరి, మల్లేష్, శాంతారావు, రాంప్రసాద్, రవి, తదితరులు పాల్గొన్నారు.

రాళ్లుతేలిన రహదారి



ఎల్.ఎన్.పేట మండలంలోని మారుమూలన ఉన్న మురగడలోవ గిరిజన గ్రామానికి వెళ్లే రోడ్డులో రాళ్లు తేలాయి. అలికాం–బత్తిలి రోడ్డు అమృతలింగానగరం సమీపం నుంచి జంబాడ జంక్షన్ వరకు కంకర రోడ్డు ఉంది. ఇటీవల వర్షాలకు రోడ్డుపై కంకర, మట్టి కొట్టుకుపోయింది. మురగడలోవ గిరిజన గ్రామానికి వెళ్లేందుకు గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాలతోపాటు నడిచి కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డును బాగుచేయాలని గిరిజనులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

నాణ్యతకు తిలోదకాలు



ఈ చిత్రం సారవకోట మండలంలోని కొమ్ము సరియాపల్లి జంక్షన్ సమీపంలో ముక్కలూడుతున్న రోడ్డు. మండలంలోని బొంతు జంక్షన్ నుంచి పాతపట్నం మండలం తెంబూరు వరకు వేసిన ఆర్‌అండ్‌బీ రోడ్డు వేసిన నాలుగు నెలలకే ఎక్కిడిక్కడే పెచ్చులు ఊడుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తెంబూరు నుంచి పెద్దలంబ వరకు రోడ్డు నిర్మించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు ఏ స్థాయిలో పాటించారో ఈ రోడ్డును చూస్తే అర్థమవుతోంది.

– సారవకోట

కల్యాణం.. కమనీయం



కొత్తూరు మండలంలోని కర్లెమ్మ పంచాయతీ పరిధి మహాసింగి సమీపంలో ఇటీవల పునర్ నిర్మాణం చేపట్టిన వరహా లక్ష్మీనరసింహ ఆలయంలో బుధవారం స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ పునః ప్రతిష్ట జరిగి 40 రోజులు కావడంతో కల్యాణం, శాంతి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వేదపండితులు వరదాచార్యులు, ఆలయ అర్చకులు బాలకృష్ణ పాడి తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు గోగులు వరప్రసాదరావునాయుడు, సర్పంచ్ ఎల్.భగవాన్‌నాయుడు, పడాల లక్ష్మణరావు, ఎద్దు కన్నంనాయుడు, శ్రీనివాసరావునాయుడు, వెంకటకృష్ణ, జానకిరామయ్య, భానుమూర్తి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–కొత్తూరు

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు

పాతపట్నం: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు అన్నారు. డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం విభాగాధిపతి పి.కామేశ్వరరావు రచించిన ఖగోళ భౌతిక శాస్త్రం పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఖగోళం ఏర్పడిన విధానం, గ్రహణం, ఉల్కలు, నక్షత్ర గమనం, తదితర విషయాలను పుస్తకంలో పొందుపరిచారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండాల చక్రపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిందితులను గుర్తించాలి



కూర్మ గ్రామాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు

హిరమండలం: మండలంలోని కూర్మ గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం ఘటనలో నిందితులను గుర్తించి, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని బీజేపీ నాయకులు కోరారు. కూర్మ గ్రామాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎస్.మాధవ్, జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తుజేశ్వరరావు బుధవారం సందర్శించారు. అక్కడ ఉన్న కృష్ణ భక్తులను కలిసి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

శివాలయాన్ని దర్శించుకున్న రెడ్డి శాంతి



రెడ్డి శాంతిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–2 ఆర్ ఆర్ కాలనీలో నిర్మించిన శివాలయాన్ని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం దర్శించుకున్నారు. ఆమెను ఆలయ అర్చకులు ఆహ్వానించి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఎంపీపీ ఎస్.సావిత్రి, సర్పంచ్ యర్లంకి ధర్మారావు, పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం: ఈ నెల 19వ తేదీన పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పాతపట్నం విద్యుత్ శాఖ డీఈఈ జి.ప్రసాదరావు బుధవారం తెలిపారు. పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులు, కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు చేస్తామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చంగుడి, సరాలి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

హిరమండలం: ఈ నెల 20వ తేదీన హిరమండలం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో (11 కేవీ తులగాం ఫీడర్) చెట్ల కొమ్మలు తొలగింపు పనులు, విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గొట్ట, తుంగతంపర, చొర్లంగి, కల్లట, జిల్లోడిపేట, భగీరథిపురం, పింద్రువాడ, అంబావల్లి, అక్కరాపల్లి, కిట్టాలపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఇంటి పన్ను వసూలు చేయాలి

కొత్తూరు: ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ వసంతకుమారి అన్నారు. మండలంలోని పానుటూరు గ్రామ సచివాలయాన్ని బుధవారం సందర్శించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ చామంతి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

కరవంజ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శివశంకర్



జలుమూరు: కరవంజ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రఘుపాత్రుని శివశంకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మన్యం జిల్లా భామిని మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన గణేష్ పట్నాయక్ జి.సిగడాం మండలానికి బదిలీపై వెళ్లారు. ఉత్తమ ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులతో కలిసి పని చేస్తానన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ఫిజియోథరపీ నిర్వహిస్తున్న గ్రేషి శాంతి

హిరమండలం: ప్రత్యేకావసరాలగల చిన్నారులకు ఫిజియోథెరపీ వరమని ఫిజియోథెరపిస్టు గ్రేషి శాంతి అన్నారు. బుధవారం భవిత కేంద్రంలో చిన్నారులకు ఫిజియోథెరపీ చేశారు. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయడం వల్ల వైకల్యాన్ని కొంత మేర అదుపులోకి తేవచ్చన్నారు. ప్రతివారం నిర్వహించే శిబిరానికి పిల్లలను కేంద్రాలకు తీసుకురావాలన్నారు.

ఎం.ఎల్.పురంలో పొలం పిలుస్తోంది



రైతులుకు సూచనలిస్తున్న ఏఓ సంధ్య

హిరమండలం: సాగులో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సూచనలు పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి సంధ్య అన్నారు. బుధవారం ఎం.ఎల్.పురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి విత్తనాలు వేసుకునే క్రమంలో రైతులకు సాగు సూచనలు అందించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాగు సలహాలు అందించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పాతపట్నం: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పాతపట్నం బార్ ప్రెసిడెంట్ గేదెల సూర్యరావు (సూర్యం) అన్నారు. పాతపట్నం కోర్టు కూడలి సమీపంలోని పాతపట్నం–3 గ్రామ సచివాలయంలో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ.. రాజ్యాంగం పౌరులకు వివిధ హక్కులు కల్పించిందని, వాటికి భంగం కలిగినప్పుడు చట్టాలు ఉపయోగపడతాయన్నారు. గ్రామాల్లో ఎక్కువగా చిన్న, చిన్న తగాదాలు జరుగుతుంటాయని, ప్రతీ దానికి కోర్టుల చుట్టూ తిరగకుండా గ్రామ పెద్దల సమక్షంలోనే పరిష్కరించుకోవాలన్నారు. శిర్ల జోగారావు, న్యాయవాదులు ఎం.రమణ, యు.దాలయ్య, సచివాలయ ఉద్యోగులు, పోలీసులు పాల్గొన్నారు.

విత్తన గులికలతో ప్రయోజనం



విత్తన గులికల తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు: వరి విత్తన గులికలు వినియోగంచడం వలన పలు ప్రయోజనాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయం ఎం.టి.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని శోభనాపురం గ్రామంలో వరి విత్తన గులికల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. వరి గులికలు వేయడం వలన వర్షాభావ పరిస్థితులు తట్టుకుంటాయన్నారు. మట్టిలో దున్ని కలిపేయడం వలన చీడపీడలు నుంచి హాని ఉండదన్నారు. విత్తనాలకు మూడు పొరలుగా బంకమట్టి, పొయ్యి బూడిద, జీవామృతం పూయాలన్నారు. ఈ విధంగా చేయడం వలన విత్తనం మొలకెత్తిన నాటి నుంచే బలంగా ఉంటుందన్నారు. ప్రతీ రైతు వరి గులికలు తయారు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.